క్లుప్తంగా

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



యూజీడీ పనులను పరిశీలిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని యర్రగుడిపల్లెలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నాణ్యతలో రాజీ లేకుండా డ్రైనేజీ పనులు, సీసీ రోడ్ల పనులు కాంట్రాక్టర్లు పూర్తి చేయాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పనులు కూడా సకాలంలో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్‌సప్లై రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధరరెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్లు పురుషోత్తం, కోడిరమణ, డేనియల్, కోఆప్షన్‌మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ నాయకులు కోళ్లభాస్కర్, సూరి, కృష్ణమూర్తి, విజయ్, శంకర్, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలలో సమస్యలు సృష్టిస్తే చర్యలు తప్పవు



ప్రజలతో మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

జమ్మలమడుగు : గ్రామాలలో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ యశ్వంత్ తెలిపారు. మంగళవారం మండలంలోని అతి సమస్యాత్మక గ్రామమైన పెద్దదండ్లూరులో ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో ప్రజలు కలిసి మెలసి ఉండాలని ఏమైన సమస్యలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామంలో శాంతి కమిటీని ఏర్పాటు చేశామన్నారు. రాబోయే ఎన్నికల్లో సమస్యలు సృష్టించేవారిపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

చింతకొమ్మదిన్నె : జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని సీకేదిన్నె జడ్పీటీసీ సభ్యుడు పి.నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని ఆజాద్‌నగర్‌లో ఆయన గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పి .రవీంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రజలందరికీ తిరిగి సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు చేసింది ఏమీలేదన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే తిరిగి జన్మభూమి కమిటీల చుట్టూ పథకాల కోసం చెప్పులు అరిగేలా తిరగాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కష్టయ్య, సింగిల్ విండో అధ్యక్షుడు గజ్జల శ్రీరామ్‌రెడ్డి, సర్పంచులు వడ్డిరెడ్డి సురేంద్రరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, ప్రసాద్ రెడ్డి, మునయ్య, బీసీ, ఎస్సీ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

కమలాపురం : నగర పంచాయతీ 1వ సచివాలయం పరిధిలోని పుట్లంపల్లె రోడ్డులో ఉన్న జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో బుధవారం జరిగే ఆరోగ్య సురక్ష–ఫేజ్2 శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ రాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే స్పెషలిస్ట్ డాక్టర్లు శిబిరంలో అందుబాటులో ఉండి వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. 1వ సచివాలయం పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఆరోగ్య సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

పులివెందుల అరటికి ఢిల్లీలో డిమాండ్

- నియోజకవర్గంలో 10వేల ఎకరాలలో అరటి సాగు
- నెలకు 10వేల టన్నుల మేర ఢిల్లీ మార్కెట్‌కు సరఫరా
- టన్ను అరటి రూ.18 వేలతో కొనుగోలు చేస్తున్న వ్యాపారులు



శుద్ధి చేసిన అరటిని ప్యాక్ చేస్తున్న కూలీలు

వేముల : జిల్లా మొత్తం మీద సాగయ్యే అరటి పులివెందుల నియోజకవర్గంలోనే అధికంగా సాగవుతోంది. పులివెందుల అరటికి ఢిల్లీలోనే కాకుండా విదేశాల్లో కూడా మంచి డిమాండ్ పలుకుతోంది. వ్యాపారులు తోటల వద్దకు వెళ్లి ఢిల్లీ మార్కెట్‌కు అనుకూలంగా ఉన్న తోటలను ఎంచుకుని అరటికాయలను కొనుగోలు చేస్తారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి ధరలు నిర్ణయించి కొనుగోలు చేయడం ద్వారా దళారుల బెడద లేకుండా పోయింది.

నియోజకవర్గంలో 10 వేల ఎకరాల్లో ..

పులివెందుల నియోజకవర్గంలో 10వేల ఎకరాల్లో అరటిగెలలు కోతకు రానున్నాయి. మామూలుగా నియోజకవర్గ వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో అరటి సాగు ఉంటే ఇందులో 10వేల ఎకరాల్లో అరటి గెలలు మొదటి కోతకు రానున్నాయి. నియోజకవర్గంలోని పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె మండలాల్లో అధికంగానూ, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో తక్కువగా సాగు అవుతోంది. ఒకసారి సాగు చేస్తే మూడు పంటలు తీయవచ్చన్న ఉద్దేశంతో రైతులు అరటిని ఎంచుకుంటున్నారు. ఎక్కువగా మే, జూన్, జూలై నెలల్లో అరటిని సాగు చేస్తారు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో అరటి గెలలు కోతకు వచ్చేలా సాగు చేయడం ద్వారా అరటి ధరలు ఉంటాయని రైతులు అంటున్నారు.

ఎకరాకు రూ.60వేలు పైనే పెట్టుబడులు..

అరటి సాగులో పెట్టుబడులు కూడా అధికం అవుతున్నాయి. ఎకరా అరటి సాగు చేయాలంటే రూ.60వేల నుంచి రూ.70వేల వరకు పెట్టుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అరటి సాగు చేసిన 11 నెలలకు తోటలలో గెలలు కోతకు వస్తాయి. అరటికి డ్రిప్పు ద్వారా నీటి తడులతో పాటు ఎరువులు అందించడం ద్వారా నాణ్యమైన అరటి ఉత్పత్తులు అందుతున్నాయి. సాగులో ఎకరాకు 10 నుంచి 15 టన్నుల వరకు దిగుబడులు వస్తున్నాయి.

వారం రోజుల పాటు అరటి కాయల నిల్వ..

పులివెందుల నుంచి అరటిని ఢిల్లీకి తరలించాలంటే వారంరోజులు పడుతుంది. ఇక్కడ పండించిన అరటి వారంరోజుల పాటు నిల్వ ఉండటం ద్వారా ఢిల్లీకి సరఫరా చేసేందుకు ఇబ్బందులు లేవు. పక్వానికి వచ్చిన అరటి గెలలను కొట్టి చీపులను వేరుచేస్తారు. ఎలాంటి రసాయనాలు వాడకుండా వారం పాటు నిల్వ ఉండటంతో ఢిల్లీకి చెందిన వ్యాపారులు పులివెందుల అరటి కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు. ఒక్కోసారి అరటి గెలలను లారీకి లోడ్ చేసి ఢిల్లీకి తరలిస్తారు. ఇక్కడి నుంచి ఢిల్లీకి వెళ్లేసరికి అరటి గెలలు దెబ్బతినవని, కాయలు నాణ్యతగా ఉంటాయని వ్యాపారులు చెబుతున్నారు.

అరటికాయలను శుద్ధిచేసి ప్యాకింగ్..

పులివెందుల నుంచి అరటి కాయలను ఢిల్లీకి తరలించాలంటే శుద్ధి చేసి ప్యాకింగ్ చేయాల్సి ఉంటుంది. దీంతో తోటల వద్దకు కూలీలు వెళ్లి అరటి గెలలు తీసుకువచ్చి చీపులను వేరుచేస్తారు. వీటిని బ్లీచింగ్ పౌడర్ కలిపిన నీటిలో శుద్ధి చేస్తారు. అలా శుద్ధిచేసిన చీపులను అట్టపెట్టెలో కవరు వేసి అందులో అరటి కాయలను ఉంచి ప్యాకింగ్ చేస్తారు. ఒక్కో అట్టపెట్టెలో 15కిలోల చొప్పున అరటికాయలను ప్యాక్ చేస్తారు. తోటల వద్దనే తూకాలు వేసి అట్టపెట్టెలను సీజ్ చేస్తారు. అరటికాయలతో ఉన్న అరటి పెట్టెలను లోడ్ చేసి ఢిల్లీ మార్కెట్‌కు తరలిస్తారు.

నెలకు 10వేల టన్నుల మేర సరఫరా..

పులివెందుల అరటికి ఢిల్లీ మార్కెట్‌లో డిమాండ్ ఉండడంతో నెలకు 10వేల టన్నుల మేర అరటి కాయలు ఢిల్లీ మార్కెట్‌కు తరలి వెళ్తున్నాయి. ఎక్కువగా ఈ సీజన్‌లోనే ఢిల్లీ మార్కెట్‌లో పులివెందుల అరటికి డిమాండ్ ఉంటుంది. మొదటిపంట అరటిగెలలు నాణ్యతగా ఉండటం, సైజు పెద్దగా ఉండటం వల్ల ఢిల్లీ మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. ఒక్కోసారి డిమాండ్ ఎక్కువగా ఉన్నట్లైతే నెలకు 40 నుంచి 50 లారీలు ఢిల్లీ మార్కెట్‌కు తరలిస్తారని హెచ్ఓ తెలిపారు.

ఢిల్లీ మార్కెట్‌లో మంచి డిమాండ్



పులివెందుల ప్రాంతంలో పండిన అరటికి ఢిల్లీ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎక్కువగా ఈ సీజన్‌లోనే ఇక్కడ అరటి కాయలను తరలిస్తారు. నెలకు 10వేల టన్నుల మేర అరటికాయలు ఢిల్లీ మార్కెట్‌కు వ్యాపారులు తరలిస్తున్నారు. ఇక్కడ పండించిన అరటి నాణ్యతగా ఉండటం, వారం రోజుల పాటు నిల్వ ఉండటం వల్ల ఢిల్లీ మార్కెట్‌లో డిమాండ్ ఉంది.

రాఘవేంద్రారెడ్డి, హెచ్ఓ, పులివెందుల

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించండి



జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఓటర్లను కోరుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం మండలంలోని మొయిల్లచెరువు, పెద్దయ్యగారిపల్లె గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం మొయిళ్లచెరువు గ్రామంలోని రజకులు దోబీ ఘాట్ ఏర్పాటు చేసిన పైపులైను దెబ్బతినిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే మరమ్మతులు చేయిస్తానని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఏ చిన్న సమస్య ఉన్నా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను గుర్తించేందుకు వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు వారి సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించేందుకు వీలుగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశాడన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరముందన్నారు. 2014 ఎన్నికల్లో అధికారంలోకి రాగానే అన్ని రకాల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి ఎన్నికల తరువాత మాటను మరచిన వ్యక్తి చంద్రబాబునాయుడు అని ఆయన గుర్తు చేశారు. అటువంటి వ్యక్తి మళ్లీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి రావడానికి సిద్ధమవుతున్నారన్నారు. వారి మాటలను నమ్మొద్దని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు వెంకటరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, జేసీసీ కన్వీనర్ మహేంద్రారెడ్డి, స్థానిక నాయకులు రామాంజనేయరెడ్డి, శంబురెడ్డి, వెంకటరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఓబుల్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోపట్నూతలలో పర్యటించిన సతీష్‌రెడ్డి



దంతలూరు కృష్ణతో చర్చిస్తున్న ఎస్.వి.సతీష్‌రెడ్డి

లింగాల : మాజీ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎస్.వి.సతీష్‌రెడ్డి మంగళవారం లోపట్నూతల గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు అలవలపాటి నాగభూషణ్‌రెడ్డి ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు దంతలూరు కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్.వి.సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి మనసున్న నాయకుడన్నారు. ఆయనను కలిసిన ప్రతి ఒక్కరికి తగిన న్యాయం చేయాలనే తాపత్రయం ఉందన్నారు. మంచి మనసుతో ప్రజలనే కాక నాయకులను కూడా ఆకర్షించే తత్వం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. ఇతరులను ఇబ్బంది పెట్టి తాను ఎదగాలనే మనస్తత్వం కాదని, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు ఇతరులను ఇబ్బందిపెట్టి తన గుప్పెట్లో పెట్టుకుని బ్లాక్ మెయిల్ చేసే తత్వం ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన తర్వాత ఆయన వెన్నంటి ఉండి వైఎస్సార్‌సీపీ అభ్యున్నతికి అంకిత భావంతో కృషి చేస్తానని ఆయన అన్నారు. విందు అనంతరం గ్రామంలోని టీడీపీ సానుభూతిపరుల ఇళ్లకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బాబురెడ్డి, వేంపల్లె, లింగాల మండలాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసేవారిని నమ్మొద్దు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు : రాజకీయ అవసరాలకోసం ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసే వారిని ప్రజలు నమ్మవద్దు అని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఏడోవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు చెప్పిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేయలేదన్నాడు. రాబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఇప్పటికే స్టీల్‌ప్లాంట్ పనులకు శంఖుస్థాపన, గండికోటలో ఓబెరాయ్ హోటల్స్ నిర్మాణాలకు శంఖుస్థాపన చేశారన్నారు. తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే వీలైనంత త్వరగా పనులు ప్రారంభమై నిరుద్యోగులకు ఉపాధి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, వైస్ చైర్మన్ సింగరయ్య, కౌన్సిలర్లు విజయ, పోచిరెడ్డి, గౌరీనాథ్‌రావు, కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్థాంతరంగా ముగిసిన కౌన్సిల్ సమావేశం

ఎర్రగుంట్ల : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అర్థాంతరంగా ముగిసింది. సమావేశం ప్రారంభంలోనే మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జైబూన్నీసా, కౌన్సిలర్లు మహమ్మద్ ఆలీ, పెన్నారషీద్, ఎరికలరెడ్డి, నాగిరెడ్డిలు మున్సిపల్ అధికారుల స్పందన లేకపోవడంపై ఆగ్రహించి మధ్యలోనే వెళ్లిపోయారు. 20 మంది కౌన్సిలర్లకు గాను కేవలం ఆరు మంది మాత్రమే హాజరయ్యారు. ఈనెల 4వ తేదీన జరిగిన ఇళ్ల పట్టాల పంపిణీలో కౌన్సిలర్లకు ఎలాంటి పిలుపు లేదనే విషయంపై కౌన్సిలర్లు ఆగ్రహించినట్లు సమాచారం. మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, ఆర్.గంగిరెడ్డిలు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

వేముల : మండల వ్యాప్తంగా వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చల్లా గంగాదేవి తెలిపారు. నూతనంగా బదిలీపై వచ్చిన వేముల ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌తో ఆమె మంగళవారం సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మోటార్లకు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. గ్రామంలోని ఉపాధి పనులలో కూలీలను పెంచేలా చూడాలన్నారు. పని కావాల్సిన ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. అనంతరం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వారు చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో అహోబిలాపురంలో విద్యార్థులచే అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండవచ్చన్నారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. మంచి ఆహారం, నీరు తీసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనీత మాట్లాడుతూ వేసవిలో అధిక ఉష్ణోగ్రత ప్రభావంతో నీరసం ఏర్పడుతుందని, విద్యార్థులు కొబ్బరినీరు, గ్లూకోజ్, నిమ్మరసం ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సుధీర్, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని పార్నపల్లె రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంటు లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న నేపథ్యలలో నేడు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్నపల్లి రోడ్డు ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సింహాద్రిపురం విద్యార్థులకు అబాకస్ ర్యాంకులు



బహుమతులతో విద్యార్థులు

సింహాద్రిపురం : స్థానిక విశ్వం ఎడ్యుటెక్ వారి ఆధ్వర్యంలో అబాకస్ జోనల్ లెవెల్ కాంపిటీషన్ ఏప్రిల్ 3 2024 ఆదివారం రోజున కడపలో నిర్వహించారు. ఈ కాంపిటీషన్‌లో శ్రీ వివేకానంద హైస్కూల్, సింహాద్రిపురంకు చెందిన విద్యార్థులు లెవెల్ 3 కేటగిరీలో జిల్లాస్థాయి మొదటి ర్యాంకును జి.దేవ దివిజసాయిరెడ్డి, లెవెల్ 1 కేటగిరీలో జిల్లాస్థాయి రెండవ ర్యాంకును జి.లక్ష్మీనరసింహ, లెవెల్ 3 కేటగిరి నందు జు.కీర్తన కన్సోలేషన్ బహుమతులు మరియు షీల్డ్ సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.ఖాదర్ వలి, డైరెక్టర్ కె.జాఫర్, హెడ్ మిస్ట్రెస్ కె.షహనాజ్ బేగం, పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, బహుమతులు సాధించిన విద్యార్థులను ప్రశంసించారు.

11న జిల్లాస్థాయి బండలాగుడు పోటీలు

చింతకొమ్మదిన్నె : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కొత్తపేట గంగమ్మతల్లి తిరుణాల సందర్భంగా ఈనె 11న జిల్లాస్థాయి సీనియర్ ఎద్ల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ. పి. సురేషకుమార్‌రెడ్డి తెలిపారు. మొదటి బహుమతి రూ.60 వేలు, రెండవ బహుమతి రూ.50 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి రూ.30 వేలు, ఐదవ బహుమతి రూ.20 వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలు, ఏడవ బహుమతి రూ.5వేలు ఇస్తున్నట్లు తెలిపారు. బండలాగుడు పోటీల్లో పాల్గొనే ఎద్ల యజమానులు ఉదయం 9 లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

వేరుశనగ పంట పరిశీలన



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

తొండూరు : మండలంలోని బూచుపల్లె, మల్లేల, సంతకొవ్వూరు గ్రామాల్లో రబీలో సాగుచేసిన వేరుశనగ పంటను వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సునీత, భాగవత ప్రియ పరిశీలించారు. మండలంలో వేరుశనగను సూటి, చీనీలో మిశ్రమ పంటగా 1463 ఎకరాల్లో సాగుచేశారు. మండలంలో ఎక్కువగా కె–1812 కదిరి లేపాక్షి సాగుచేశారు. నవంబర్, డిసెంబర్‌లో సాగుచేసిన వేరుశనగలో మువ్వకుళ్లు, కాండం కుళ్లు వైరస్ తెగులు ఎక్కువగా ఆశించింది. దీని నివారణకు పంటలో కలుపుమొక్కలు (వయ్యారి భామ) లేకుండా చేయాలి. వైరస్ సోకిన మొక్కలను తీసి కాల్చివేయాలి. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తగిన మందులను పిచికారీ చేసి తెగుళ్లను నివారించుకుని అధిక దిగుబడులు సాధించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మధుసూదన్‌రెడ్డి, ఆర్బీకే సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

నేడు మహిళలకు ఉపన్యాస పోటీలు

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం స్నేహిత అమృతహస్తం సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సమితి అధ్యక్షులు రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు ఏమిటి? అన్న అంశంపై ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తిగల మహిళలు ఈ పోటీల్లో పాల్గొని మహిళా దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలన్నారు.